# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 13 మే , 2025 | పేజీలు : 06





వివరాలు మెయిన్‌లో

టెర్రరిస్టులను మట్టుబెట్టాలి : నారాయణ

**సాగర్ అందాల చెంత**

# సుందరీమణులు



### బుద్ధవనాన్ని సందర్శించిన 22 ఆసియా దేశాల సుందరీమణుల పోటీదారుల బృందం

### నాగార్జున సాగర్ తీరం అందాల అంచున ,బుద్ధవనం మహాస్థూపం, బుద్ధుని మహా పాదాలకు పూలతో పూజలు ,మహా స్థూపంలో జ్యోతి ప్రజ్వలన, ధ్యానంలో పాల్గొన్న సుందరీమణులు

### ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్‌పి

### హాజరైన ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి,బాలు నాయక్,బత్తుల లక్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్


**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి:** తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది సుందరీమణుల బృందం సోమవారం నల్లగొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది. ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్ లో ఫోటోలు దిగారు.అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానం లో పాల్గొన్నారు.మహా స్థూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రాముఖ్యత,బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు.అనంతరం జాతకవనంలో బుద్ధ చరితం పై కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్ పి శరత్ చంద్ర పవార్ ,ఎం ఎల్ ఏ లు కుందూరు జయవీర్ రెడ్డి,బత్తుల లక్మారెడ్డి,బాలునాయక్, ఎం ఎల్ సి శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం ,నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను ,తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు. ఐ ఏ ఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్,ఏ ఎస్ పి లు రమేష్,మౌనిక,ఆర్ డి వోలు,జిల్లా అధికారులు,తదితరులు హాజరయ్యారు.



## చింతపల్లిలో ప్రపంచ అందాల తారల విశ్రాంతి

**ప్రజాపక్షం/చింతపల్లి** : ప్రపంచ సుందరీమణుల పోటీలు నాగార్జునాసాగర్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. అందాల తారలు సోమవారాం హైదరాబాద్ నుండి నాగార్జునాసాగర్ వెళ్తున్న సందర్భంలో మార్గమధ్యలో మండల పరిధిలోని తీదేడు గ్రామ శివారులో నాగార్జునాసాగర్ రహదారి పక్కనే ఉన్నా వెల్లంకి ఫుడ్స్‌లో అధికారులు వారికి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాటు చేశారు. స్నాక్స్ తీసుకున్న అనంతరం సుందరీమణులు నాగార్జునా సాగర్‌కు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి మౌనిక, ఆర్‌డిఓ రమణారెడ్డి, డిఎస్‌పిలు, ఆహసీల్దారు రమాకాంత్ శర్మ, పర్యాటక రంగ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఎసిబి వలలో చిక్కిన సూర్యాపేట డిఎస్‌పి పార్థసారధి టౌన్ సిఐ వీరరాఘవులు



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** అక్రమ సొమ్ముకు ఆశపడి చివరికి ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి సూర్యాపేట డిఎస్పీ పార్థసారధి, పట్టణ సిఐ వీరరాఘవులు ఎసిబి వలకు చిక్కారు.ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రులపై ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో అర్హతలేని వైద్యులు రోగులకు వైద్యం చేస్తున్నారని, స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు టెస్టులు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాడం ఆడుతున్నట్లు గుర్తించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోట చలంకు నివేదికను అందజేశారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటచలం సదరు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులకు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకునికి షోకాజు నోటీసులు అందజేసి వివరణ కోరడంతో పాటు సూర్యాపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు స్కానింగ్ సెంటర్ నిర్వాహకునికి పట్టణ ఇన్స్‌పెక్టర్ వీరరాఘవులు ఫోన్ చేసి కేసు విషయంలో డిఎస్పీ పార్థసా రధిని కలవాలంటూ చెప్పారు.దీంతో స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు డిఎస్పీ పార్థసారధి కలవగా పట్టణ ఇన్స్‌పెక్టర్ వీరరాఘవులు అక్కడకు చేరుకుని ఇరువురు కలిసి కేసు విషయంలో బేరసారాలకు దిగారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదును నీరు గార్చేలా చేస్తామని, అరెస్టు కాకుండా చూస్తామని చెప్పి 25 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు తాను ఇంత ఇచ్చుకోలేనని 16 లక్షల రూపాయలకు ఒప్పందం కూదుర్చుకున్నాడు. అందులో కొంత ముట్టచెప్పగా మరికొంత డబ్బు ఆలస్యం కాక అతడిపై తీవ్ర ఓత్తిడి తెచ్చారు. దీంతో చేసేదేమీలేక ఎసిబి అధికారులను స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు ఆశ్రయిం చాడు. ఫిర్యాదు స్వీకరించిన ఎసిబి డిఎస్పీ జగదీష్ చందర్ సోమవారం రాత్రి సూర్యాపేట డిఎస్పీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిఎస్పీ పార్థసారధి, పట్టణ ఇనస్‌పెక్టర్ వీరరాఘ వులు విచారించిన ఆయన అనంతరం మీడిమాతొ మాట్లా డారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు తాము తనిఖీ చేసి వారిని విచారించినట్లు తెలిపారు. ఇందు లో వాస్తవం తేలడంతో డిఎస్పీ పార్థసారధి, పట్టణ ఇన్స్‌పెక్టర్ వీరరాఘవులును అదుపలోకి తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ ఇరువురిని మంగళవారం ఎసిబి కోర్టుకు హాజరుప ర్చనున్నట్లు తెలిపారు. ఈ అధికారుల ఇళ్లలో కూడా సోదా లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎసిబి ఎస్పీ అధికారి కమలాకర్‌రెడ్డి, నల్లగొండ ఎసిబి రేంజీ బృంద సభ్యులు పాల్గొన్నారు.





## రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/నూతన్‌కల్ (మద్దిరాల):** ప్రతి ఒక్కరు రోడ్డు నియమ నిబంధనలు పాటించి ప్రమాదాల బారీన పడకుండా ఉండాలని మద్దిరాల ఎస్ఐ వీరన్న అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ అదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇవ్వడం పెద్ద ప్రమాదమని, రోడ్డు నిబంధనలు, చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలు ఇచ్చి ఒక సారి పట్టుబడితే 25 సంవత్సరాలు వయసు వచ్చే వరకు లైసెన్స్ ఇవ్వడం కుదరదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను పోలీస్‌శాఖ పటిష్టంగా అమలు చేస్తుందని, కొత్త నిబంధనల ప్రకారం మైనర్ డ్రైవింగ్ కు గరిష్టంగా 25వేలు జరిమాన ఉంటుందని, తల్లిదండ్రులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సాలయ్య, కానిస్టేబుల్ కృష్ణ, మధు, సల్మాన్, మహిళ కానిస్టుబుల్ జరీనా, ప్రియాంక, మల్సూర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ జిల్లా నాయకులు సైదులుకు పితృవియోగం



**ప్రజాపక్షం/చివ్వెంల:** మండల పరిధిలోని మోదింపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్, ప్రస్తుతం హైకోర్టు న్యాయవాది ఉటుకూరి సైదులు తండ్రి జానయ్య (85) మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషఫ్ దుర్గం ప్రభాకర్ పూలమాలలువేసినివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరమార్శించారు. జానయ్యకు భార్య, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ పౌండేషన్ చైర్మన్ యాతాకుల సునీల్, దుబ్బ రమేష్, కత్తి ఉపేందర్, యాదాసు గోపి, కత్తి వెంకన్న, ఫాస్టర్ ఉటుకూరి రాజు, బాణాల సైమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరా ప్రేమ జ్యోతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థుల కోసం వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈ శిక్షణ తరగతులను ఈనెల 15 నుండి ప్రారంభిస్తున్నట్లు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్ లైఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఇండోర్ గేమ్స్ పలు అంశాల్లో శిక్షణా ఇవ్వనున్నట్లు ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ విజయ లక్ష్మి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మనిషి మనుగడకు ఆహారపు అలవాట్లు ప్రధాన కారణమని, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆయు ప్రమాణాన్ని పెంచుకోనే అవకాశం ఉందని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు పాదూరి రమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిల్లాపురం, ఐలాపురం, పెద్ద దేవులపల్లి గ్రామాల్లో ఉపాధి హామి పనులు చేసే కూలీల వద్దకు వెళ్లి ఆరోగ్య విషయాలు చెబుతూ ఉపాధి హామీ పనుల నాణ్యత పెంచాలని, వేసవి దృష్టిలో ఉంచుకోని వీలైనంత వరకు ఉదయం తొందరగా వెళ్లి పనులను చేసుకోని ఎండ సమయానికి ముగించుకోవాలన్నారు. అదేవిధంగా పక్షవాతం, మూర్ఛ, బీపీ, షుగర్ వ్యాది ఉన్న నిరుపేదలకు పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని నవ జ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వైద్యులు గోపాలం శివన్నారాయణచే నామమాత్రంగా ఫీజు తీసుకోని వైద్యం చేస్తారని అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్ మాట్లాడుతూ మేలైన వంట నూనెలను వాడాలని అన్నారు. జేవీవీ నాయకులు బక్కా శ్రీనివాసచారి మాట్లాడుతూ కృత్రిమ శీతల పానియాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులను నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. జేవీవీ నాయకుడు మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన జెనిరిక్ మందులను వాడాలని, వాణిజ్య ప్రకటనలను చూసి మోసపోవద్దని, వేసవిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎలు, ఉపాది హామి సిబ్బంది పాల్గొన్నారు.

## నరసింహారెడ్డి పద్మ దంపతులకు సన్మానం



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఉన్న ఊరు కన్న తల్లి లాంటిది అంటారు ఆ రుణం తీర్చుకునేందుకు అందరికీ అవకాశం రాదు అవకాశం వచ్చిన వినియోగించుకోవడంలో ముందుకు వచ్చినవారు బహు కొద్ది మంది ఉంటారు. అందులో కానుగంటి నరసింహారెడ్డి పద్మ దంపతులు ముందంజలో నిలిచారు. తమ వంతు సమాజానికి సేవ చేయాలనే విశాల దృక్పథంతో రాజుపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన కానుగంటి నరసింహారెడ్డి పద్మ దంపతులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి కలెక్టర్ హనుమంతరావును స్వయంగా కలిసి తమ వంతు బాధ్యతగా సమాజానికి సేవ చేయడానికి ముందుకు వచ్చామని ప్రభుత్వ స్థలాన్ని కేటాయించగలిగితే హాస్పిటల్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వృద్ధ దంపతులిద్దరిని సన్మానిస్తూ సమాజ సేవ చేసేందుకు ముందుకు రావడం గర్వకారణంగా ఉందని, తప్పని సరిగా సహకారం అందించగలమని ఇదే రీతిలో పలువురు దాతలు స్ఫూర్తినందుకొని ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి ఎకరం ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు పార్టీ జిల్లా అధ్యక్షులు, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్నయాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అదేశాలతో పార్టీ జిల్లా కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని కోరుతూ కలెక్టర్లకు వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ధారావత్ వీరన్ననాయక్, నాయకులు రుద్రంగిరవి, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, చింతమళ్ల రమేష్, పందిరి మల్లేష్ పాల్గొన్నారు.

## చౌక ధర దుకాణాల తనిఖీ



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని కొండమడుగు, రహీంఖాన్‌గూడా, రాఘవపూర్, రుద్రవెల్లి, పడమటి సోమారం, వెంకిర్యాల, బీబీనగర్ షాప్ నెంబర్ 1, 2, 3లో సోమవారం హైదరాబాద్ విజిలెన్స్ ఇన్ఫోర్స్మెంట్ డిఎస్పి నర్సింగ్ యాదయ్య ఆధ్వర్యంలో చౌక ధర దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ రేషన్ డీలర్లు సమయానికి షాపులు తెరిచి వినియోగదారులకు సకాలంలో రేషన్ బియ్యం అందించాలని ఎలాంటి అవకతవగలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రేషన్ డీలర్ల ఆర్థరేషన్ రెన్యువల్ స్టాక్ రిజిస్టర్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ స్వామి దాసు, సివిల్ సప్లై డిటి నరసింహారావు, సిబ్బంది శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

### సిపిఐ మండల కార్యదర్శి వెంకటయ్య

**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండాలని గ్రామాలలో ఎక్కడైతే అసలు ఇండ్లు లేని వారు ఉన్నారని వారిని అర్హులుగా గుర్తించి వారికి న్యాయం చేయాలని గత పాలనలో పేద ప్రజలకు ఏ ఒక్కరికి న్యాయం జరగలేదని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు వస్తేనే వారికి మనం న్యాయం చేసినట్లు అవుతుందని సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు దక్కాలంటే అధికారులు పెద్ద ఎత్తున గ్రామాల్లో తిరిగి వివరాలు సేకరించాలని, గ్రామాలలో కాకుండా కొంత మంది రాజకీయపరంగా చేస్తున్నారని తప్పుడు మాటలు చెప్పడం వలన పేద ప్రజలకు కొన్ని చోట్ల ఇబ్బంది పడుతున్నారని ఇలాంటి మాటలను ఎవరు నమ్మొద్దని దేవరకొండ నియోజకవర్గంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ చెబుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పేదవారికి ఇవ్వాలని ఆయన తెలిపారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు



**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ అభిరామ్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, తెలంగాణ రైజింగ్ పాఠశాల సారథ్యంలో నిర్వహించబడుతున్న వేసవి శిక్షణ శిబిరంను డాక్టర్ సందర్శించి ఆరోగ్యం, వైద్యంపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఆగిపోయిన శాసన పునరుద్ధరించే విధానం, అత్యవసర ప్రాణపాయ ప్రమాద పరిస్థితుల గుండెకు సంబంధించిన శ్వాస నడిపే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, చల్లని ప్రదేశంలో ఉండాలని, మంచినీరు, మజ్జిగ తీసుకోవాలని, పలుచని దుస్తులు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి షేక్ సలీం షరిఫ్, ఎస్‌కె జాఫర్, ఉపాధ్యాయులు చందా శ్రీనివాసరావు, బడుగుల సైదులు, ఖాజామియా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** పాకిస్తాన్ ఉగ్ర దాడిలో వీర మరణం పొందిన వీర జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని కేశ్యతండా గ్రామ యువత ఆధ్వర్యంలో గ్రామంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి, ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా కొల్‌ముంతల్ పహాడ్ మాజీ ఎంపిటిసి రమావత్ రాణిరాజునాయక్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ మురళీనాయక్ భౌతికంగా దూరం అయ్యాడే తప్ప ప్రతి ఒక్కరి భారతీయుడి గుండె ఆయన ఎప్పటికి జీవించే ఉంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో తుల్యానాయక్, తిరుపతినాయక్, శంకర్‌నాయక్, దేవు, లాలునాయక్, భీమా, లక్ష్మణ్, హన్మంతు, పాండు, గ్రామ యువత, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/దేవరకొండ:** దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో నిర్వహించిన స్వామి వారి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ అందాల పోటీలు విరమించుకోవాలి



**ప్రజాపక్షం/డిండి;** నాగార్జునసాగర్ పర్యాటక ప్రాంతానికి సందర్శించడానికి వస్తున్న ప్రపంచ సుందరీమణుల్ని అడ్డుకుంటామని ముందస్తుగా అరెస్టు చేయడాన్ని భారత జాతీయ మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు బొల్లె మంజుల శైలేష్ సోమవారం తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మిస్ వరల్డ్ అందాల పోటీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం వేలాది రూపాయలు కేటాయిస్తూ ఇది రాష్ట్రానికి లాభదాయకమని రెవిన్యూ జనరేటింగ్ ప్రాజెక్టు అని చెప్పడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం రాష్ట్ర మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు.

## అమ్మే సృష్టికి మూలం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అమ్మనే ఈ సృష్టికి మూలమని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు, సామాజికవేత్త ధీరావత్ హన్యానాయక్ అన్నారు. మదర్స్‌డేను పురస్కరించుకోని సోమవారం ఫెయిత్ బంజారా ఆశ్రమ పాఠశాలలో చిన్నారుల చేత కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటల ద్వారా తల్లి త్యాగాన్ని స్మరించుకున్నారు. అనంతరం చిన్నారులకు దుస్తులు అందచేశారు. మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధీరావత్ రమాబాయి, మహిళలు పాల్గన్నారు.



## జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/డిండి;** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా అవసరాలను ఎలుగెత్తి చూపి ప్రభుత్వాలచే పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం ఫోర్త్ ఎస్టేట్‌గా భావించే మీడియా, పాత్రికేయ రంగంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలను ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి వేతనం లేకపోయినా ప్రజాహితం కోసం జర్నలిస్టులుగా ఎంచుకున్న వృత్తికోసం పాటుపడుతూ సమాజంలో గౌరవం తప్ప ప్రభుత్వం వారికి ఎలాంటి పథకాలు, జీవన భృతి కల్పించకపోవడంతో మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు జీవనం సాగించాలంటే ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకంలో జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. జర్నలిస్టు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చలామణి అయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. తక్షణమే ప్రభుత్వం అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలను అందించి, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/పెద్దఆడిశర్లపల్లి:** ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామవత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఘణపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రవీంద్ర కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కు లేక రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు.ములుగె నక్కపై తాటి పండు పడ్డట్టు రైతు పరిస్థితి ఉందన్నారు.అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనె దిక్కు లేదన్నారు.అందాల పోటీల పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి రైతుల ధాన్యం కొనుగోలు పై లేదన్నారు.చివరికి గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదన్నారు.కెసిఆర్ ఉన్నప్పుడు ఎప్పుడు కూడా ధాన్యం కొనుగోలులో ఇంత



ఆలస్యం కాలేదని ఆయన గుర్తు చేశారు. అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎల్గూరి వల్లపు రెడ్డి,మునగాల అంజి రెడ్డి ,అర్వపల్లి నరసింహ,మాదా సుధాకర్ గౌడ్, ఎర్ర యాదగిరి ,శ్రీను బొడ్డుపల్లి మహేందర్ ,వంగాళ కృష్ణారెడ్డి , గోలిగిరి , కర్నాటి రవి , నిమ్మల విష్ణువర్ధన్ రెడ్డి , ప్రదీప్ , శివ తదితరులు ఉన్నారు.

## నాయిని నర్సింహారెడ్డి కార్మిక పక్షపాతి



**ప్రజాపక్షం/దేవరకొండ;** నాయిని నర్సింహారెడ్డి కార్మిక హక్కుల పక్షపాతి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలో మాజీ మంత్రి స్వర్గీయ నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన నాయకుడు నాయిని నర్సింహారెడ్డి అని, రాజకీయాల్లో ఆస్తుల కంటే పేరు, గౌరవం సంపాదించిన అరుదైన నాయకుడు అని ఆయన తెలిపారు. రెండు దశాబ్దాల పాటు నాయిని నర్సింహారెడ్డి కేసీఆర్‌కు సోదరునిలా కలిసి పని చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, కృష్ణ, రాములు, లోహిత్‌రెడ్డి, చంద్రమౌళి, రాములు, ఇద్దయ్య, రాములు, భరత్, లక్ష్మణ్, మధు, జామీర్‌బాబా, రిజ్వాన్, లక్ష్మణ్, రాజేష్, ప్రవీణ్, లక్ష్మి కాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల కమిటీ సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలకేంద్రంలో భారతీయ జనతా పార్టీ తుర్కపల్లి మండల కమిటీ సన్నాహక సమావేశం నూతన మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్ ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ఇన్చార్జ్ ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ చిరిగె శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ పార్టీ మండల కమిటీ సభ్యులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ జెండాను తుర్కపల్లిలో ఎగురవేయాలని దిశా నిర్దేశం చేశారు. అలాగే ఇటీవల మరణించిన భారత జవాన్లకు మన తెలుగు జవాను మురళి నాయక్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యాట పెంటయ్య, మాజీ మండల అధ్యక్షులు శత్రు నాయక్, లక్ష్మి నారాయణ, నాయకులు కందుకూరి చెలమయ్య, నరేంద్రనాయక్, ఆకుల రమేష్, ఆకుల సైదులు, చాంద్ పాషా, జక్కుల వెంకటేశం, ఆంజనేయులు, బొల్లు నరసింహ పాల్గొన్నారు.



## వేసవి శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాదాపూర్, దత్తాయపల్లి, వీరారెడ్డి పల్లి పాఠశాలల్లో 6 నుండి 9వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణ తరగతులను ప్రభుత్వ పాఠశాల, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ఎంఈఓ మాలతి తెలిపారు. ఈ నెల 15 నుండి 15 రోజుల పాటు నిర్వహించే శిక్షణ శిబిరంలో యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్ (క్యారమ్, చెస్), డ్రాయింగ్ లాంటి తదితర అంశాలపై ఉదయం 8 నుండి 11 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రవేశం కొరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## టిడిపి డిజిటల్ సభ్యత్వ కార్డులు పంపిణీ



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి :** గుడిపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డిజిటల్ సభ్యత్వ కార్డులను సోమవారం నియోజకవర్గ ఇన్చార్జి వసుకుల కృష్ణయ్య కార్యకర్తలకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ శాఖలు వేయటం జరిగిందన్నారు.రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు.తెలంగాణలో టిడిపికి పూర్వ వైభవం రావడం ఖాయం అన్నారు.ఈ కార్యక్రమంలో గుడిపల్లి మండల సీనియర్ నాయకులు ఏలేటి నరసింహ ,పీఏ పల్లి మండల అధ్యక్షుడు సీత సీతారాములు యాదవ్ ,పోల్కంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దోసపాటి ధనంజన్ ,శ్రీలత , యల్లయ్య ,మంగమ్మ తదితరులు ఉన్నారు.

## ఈటలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** గాడి తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, బిజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే, కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలకూరి రవిగౌడ్ అన్నారు. సోమవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కుల అహంకారంతో రాజకీయ విలువలను మరచి పోయి ,ఈటెల రాజేందర్‌పై తీవ్రమైన అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని ,ఈటెలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పెద్దదిన్నె నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా సోమవారం ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి డా.ఎస్ఏ సంపత్‌కుమార్ హాజరు కావడం జరిగింది. ఇట్టి దేవస్థానం కమిటీ సభ్యులుగా నియమింపబడిన వారికి శుభాకాంక్షలు తెలియపరుస్తూ ఆలయంలో జరగబోయే ప్రతి ఒక్క విషయాలలో కమిటీ సభ్యులు అందరూ కలిసి ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఇట్టి దేవస్థానానికి పాలకవర్గానికి నియమితులైన వారు ఎండి జయసింహ చైర్మన్ పాండురంగయ్య ఎక్స్ అఫ్టియా మెంబర్ వెంకటరమణ శెట్టి సభ్యులు జి.నారాయణ సభ్యులు ఆవుల జయన్న సభ్యులు వెంకటేశ్, సభ్యులు దొడ్లనవత సభ్యులు కే.నాగలక్ష్మి , సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, ఇటిక్యాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుక్మానందరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సంకటి రాజేశ్, సోమిరెడ్డి ఎక్స్ ఎంపిటిసి, శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాల అమలుకు కాంగ్రెస్ పెద్దపీట

**- అశ్వారావుపేట మండలంలో పర్యటించిన ఎంపి, ఎమ్మెల్యే**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట వేసిందని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నా రు. సోమవారం అశ్వారావుపేట మండలంలో పర్యటించిన వారు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. అశ్వారావుపేట మున్సిపాల్టీ పరిధిలోని ఎఎస్ఆర్‌నగర్ పేరాయిగూడెం ఫైకాలనీ, కావడిగుండ్ల పంచాయతీ ఎమ్మెల్యే దత్తత గ్రామమైన చెన్నాపురంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.1.32కోట్లతో నిర్మించిన సిసి రోడ్లను, డ్రైనేజి, తదితర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఈ నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందించటం జరుగుతుందని తెలిపారు. దానికి అనుగుణంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో రూ.2.40కోట్లతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజిలు ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగానే మారుమూల గిరిజన గ్రామమైన చెన్నాపురాన్ని దత్తత తీసుకుని అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా త్వరలోనే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇందిర మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొంది పోడు సాగు చేసుకుంటున్న ప్రతిఒక్కరికి త్వరలోనే ఇందిర సౌర గిరి వికాస్ పథకం ద్వారా నూరుశాతం సబ్సిడీతో సోలార్ పంప్ సెట్లు, బోర్లు, మోటార్లు అందిస్తామని, పామాయిల్ సాగు చేసేలా ప్రోత్సహించి రాయితీల ద్వారా ఎరువులు, బిందు సేద్యం పరికరాలు అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందించటం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లల్లో పౌష్టికాహారం అందించటం కోసం నూతనంగా మెనూ అందిస్తామన్నారు.రాబోయే మూడున్నర సంవత్సరాల్లో ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వ పథకాలు అందిస్తుందన్నారు. అనంతరం అశ్వారావుపేట కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాలలో నేషనల్ నర్సింగ్ డే సందర్భంగా మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. అనంతరం గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ గుబ్బల మంగమ్మ అమ్మవారిని దర్శించి రాష్ట్ర ప్రజలు పాడిపంటలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా వర్థిల్లాలని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, ఎంపిఓ శ్రీరామ్మూర్తి, పంచాయతీరాజ్ డిఇ శ్రీధర్, ఎఇఎం అక్షిత, ఆర్‌డబ్ల్యుస్ డిఇ సలీం, మండలస్పెషలాఫీసర్ ప్రదీప్ కుమార్, కాంగ్రెస్‌మండలనాయకులు, ఇతర అధికారులుపాల్గొన్నారు.

# మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**-అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకుల పిలుపు**



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** కార్మిక, కర్షక, విద్యార్థి, నిరుద్యోగ యువత సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సంజీవరెడ్డి భవన్‌లో ఐఎన్‌టియుసి నగర అధ్యక్షులు నరాల నరేష్‌నాయుడు అధ్యక్షతన అఖిలపక్ష కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, టియుసిఐ, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయిన రైతాంగ కార్మిక వర్గ ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. భారత్ వెలిగిపోతుందని అచ్చేదిన్ అయేగా, విశ్వగురువు ఆత్మ నిర్భర్ భారత్, మేకింగ్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చినా ఏమి ఒరగలేదన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు ఉద్యోగాల కల్పన పడిపోయి నిరుద్యోగం గత 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గిపోయి ప్రపంచంలోని 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందన్నారు. మానవ అభివృద్ధిలో 191 దేశాల్లో ఇండియా 132వ స్థానంలో ఉందని వారన్నారు. మోడీ విధానాల వల్ల మధ్యతరగతి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పేదరికం, ఆకలి మొదలైన కీలక అంశాలను ప్రజల దృష్టి నుంచి మరల్చడానికి బిజెపి మతం పేరుతో దేశ సమగ్రతను దెబ్బతీస్తూ అబద్ధపు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మే 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు, సిఐటియు నాయకులు విష్ణు వర్ధన్, కళ్యాణపు వెంకటేశ్వరరావు, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు షేక్ సుభాన్, ఐఎన్‌టియుసి నగర ప్రధాన కార్యదర్శి సంగయ్య, నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు తీగలపైన చెట్టుకొమ్మలు

**-నిలిచిపోయిన విద్యుత్ సరఫరా**
**-వారం రోజులైనా పట్టించుకునే నాథుడే లేడు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇటీవల వచ్చిన గాలివానకు చెట్టు కొమ్మలు విరిగి కరెంటు తీగలపై పడి వారం రోజులు గడిచినా పట్టించుకున్న నాథుడే లేడు. పక్కనే గ్రామ పంచాయతీ కార్యాలయం ఉన్నా అక్కడి అధికారులు, సిబ్బంది సైతం స్పందించిన పాపాన పోలేదు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటే. నూతన కలెక్టరేట్ ఉన్న గ్రామం. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో ఇటీవల కురిసిన గాలి వానకు గ్రామ పంచాయతీ పక్కన ఉన్న పశు వైద్యశాల ఆవరణలోని గానుగ చెట్టు కొమ్మలు విరిగి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడ్డాయి. దీనితో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంగమ్మ గుడికి వెళ్లే విద్యుత్ లైన్ కావడంతో వారం రోజులుగా సరఫరా లేకపోవడంతో ఆలయానికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు నీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మవారికి కూడా వారం రోజులుగా చీకట్లోనే ఉంటున్నారు. పక్కనే పంచాయతీ కార్యాలయం ఉన్న అధికారులు, సిబ్బంది మాత్రం తీగలపై పడ్డ చెట్టు కొమ్మలను తొలగించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వారం రోజులు గడిచినా విద్యుత్ శాఖాధికారులు కూడా స్పందించ లేదు. విద్యుత్ శాఖాధికారులు గాలివాన వచ్చినప్పుడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఏమైనా అంతరాయం ఏర్పడిందా, చెట్లు విరిగి పడ్డాయా గమనించాల్సిన అధికారులు ఇప్పటి వరకు చూడలేదంటే శోచనీయం. వారికి సమాచారం ఉందా లేదా అన్నది కూడా తెలియని పరిస్థితి. గ్రామ పంచాయతీ అధికారుల పని తీరు ఈ ఘటనకు నిదర్శనం. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

# చారిత్రక ఆధారాలకు ఆనవాళ్లు నేలకొండపల్లి..!

**మరో చారిత్రక ఆధారం లభ్యం..!**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి చారిత్రక ఆధారాలకు పెట్టింది పేరు గా నిలుస్తుంది. ఇప్పటికే అనేక చారిత్రక ఆధారాలకు అనవాలైన నేలకొండపల్లి తవ్వే కొద్ది అనవాళ్లు లభ్యమవుతున్నాయి. స్థానిక బౌద్ధసూస్థం సమీపంలోని ఓ రైతు పొలంలో భూమి లోపటికి కూరకపోయిన నలు పలకల రాతి స్థంభం ఒకటి సోమవారం తెలంగాణ చరిత్ర బృందం కోకన్వీనర్ కట్టా శ్రీనివాస్, పసుమర్తి శ్రీనివాస్ లు పరిశీలన లో వెలుగులోకి వచ్చింది. భూమి పైన రెండు అడుగుల ఎత్తు... అడుగున్నర వెడల్పు ఎనిమిది అంగుళాల మందం ఉన్న ఒక రాతి ఫలకం పైన శాసనాలలో కనిపించే చిహ్నాలు కనిపిస్తున్నాయి. కాకతీయుల కాలంలో శైవానికి సంబంధించిన, డమురక చిహ్నం, త్రిశూల చిహ్నం తోపాటు సూర్యచంద్రుల చిహ్నాలు ఉన్నాయి. ఆచంద్రార్కం నిలబడి ఉండాలి అనే ఉద్దేశ్యంతో సూర్యచంద్రులను చెక్కేవారు. అటువంటి చిహ్నాలతో ఈ శిలాఫలకం లోని ముఖ పలకం ఉండటంతో ఈ రాతిబండ ను భూమిలో నుంచిబయటకు తీసి పరిశీలించినట్లుయితే ప్రాచీన కాలపు శాసనలేమైనా దొరికే అవకాశం ఉండోచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పొలాలలో వరి కోతలు పూర్తి అయిన ప్రోక్లెయిన్ వెళ్లటానికి అనుకూలంగా వున్న పరిస్థితులలో దీనిని పెకిలించి లోపట శాసనం వంటిది వున్నదా లేదా అనే విషయాలను పరిశీలించగలిగే అవకాశం ఉంది. ఇప్పటికే వివిధ కాలాలకు చెందిన అనేక శాసనాలు నేలకొండపల్లి లో దొరికి ఉన్న నేపధ్యంలో మరో కొత్త శాసనం దొరకటం, చరిత్రలోకొత్త కోణాలు వెలుగు లోకి రావటానికి అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# విద్యార్థి యువజన సంఘాలే దేశానికి వెన్నెముక




**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యార్థి యువజన సంఘాలే దేశానికి వెన్నెముక అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సారయ్య పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాయలంలో సోమవారం ఏర్పాటైన ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ స్థాయి సాధారణ సమావేశంలో మాట్లాడారు. దేశ స్వాతంత్రం కోసం, తెలంగాణ సాయుధ పోరాటంలో సైతం, ఎందరో విద్యార్థి అమరవీరుల త్యాగాల ఫలితంగా తెచ్చుకున్న తెలంగాణ పోరాటంలోనూ అఖిలభారత విద్యార్థి సమైక్య ఎఐవైఎఫ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. నిరుద్యోగ సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిన విద్యార్థి యువజన సంఘాలు నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటుచేసుకుని నూతన కమిటీని ఎన్నుకోవడం హర్షణీయమన్నారు. ప్రాంతాల్లో విద్యార్థి యువజన సంఘాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, నూతన కమిటీని ప్రకటించారు. ఎఐవైఎఫ్ ఇల్లందు పట్టణకార్యదర్శిగా ఈర్ల రవి, అధ్యక్షుడిగా బొర్రాజు సాయికుమార్, పట్టణ ఉపాధ్యక్షుడిగా యాకేశ్, ఎఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శిగా ఎన్.సాయి, అధ్యక్షుడిగా ఎన్.సాగర్, ఉపాధ్యక్షుడిగా అలెం సాయి, ఎఐవైఎఫ్ సమితి సభ్యులుగా ఆరుగురిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగుల్‌మీరా, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, పట్టణ, మండల కార్యదర్శులు బంధం నాగయ్య, ఉడత ఐలయ్య, శాఖ కార్యదర్శి నజీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాస శ్రీను, మండల సహాయకార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరూ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, పెట్టుబడి దారి అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ఈనెల 20 జరితే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను జయపద్రం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, గౌరీ నాగేశ్వరరావు, మాలోత్ రావూజా, నిమ్మల మధు, పాయం అమల, బైరు ప్రసాద్, గోపాగాని లక్ష్మి నరసయ్య, సోయం కృష్ణ, పద్దం తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మసీదుల అభివృద్ధికి నిధులు మంజూరు

**ఒక్కో మసీదుకు రూ. లక్ష రూపాయలు**
**చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మసీదుల అభివృద్ధికి, మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని మంత్రి పొంగులేటి నివాసంలో ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల 18 మసీదుల అభివృద్ధి, మరమ్మతుల కోసం మంజూరైన చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్బంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రంజాన్ నెలలో మసీదుల అభివృద్ధి, మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తానని మాట ఇచ్చిన ప్రకారం నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఒక్కో మసీదుకు లక్ష రూపాయల చొప్పున రూ. 18 లక్షలను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. పాలేరు నియోజక వర్గంలో మిగిలిన మండలాల్లో మసీదులకు త్వరలో నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను మసీదుల అభివృద్ధికి, మరమ్మతులకు వినియోగించాలన్నారు. ప్రతి పనికి సంబంధించిన బిల్లులు సమర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి. పురందర్, మైనార్టీ కార్యాలయ సిబ్బంది మహ్మద్ యాకూబ్‌పాషా, షేక్ సైదులు, మసీదుల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.




# సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

**ఆపదలో ఉన్నవారికి అండగా ఉండాలి : డాక్టర్ కాపా మురళీకృష్ణ**




**ప్రజాపక్షం/వైరా:** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ 2025–26 క్లబ్ జోన్ చైర్మన్ ఎంజిఎఫ్ లయన్ చింతోజు నాగేశ్వరరావు, సీత దంపతులు, క్లబ్ ఫాస్ట్ వైస్ ప్రెసిడెంట్ కొల్లా రాంబాబు, నాగమణి దంపతుల వివాహ వార్షికోత్సవం వైరాలోని సాయి మందిరంలో క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చింతోజు నాగేశ్వరరావు దంపతులు నేలకొండపల్లి మండలం చెరువు మాదారంకు చెందిన మూడో సంవత్సరం నర్సింగ్ చదువుతున్న కల్లూరి కావ్య రూ.5వేలు, వైరా లయన్స్‌క్లబ్ నుండి రూ.5వేలను ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా స్తోమత లేని నిరుపేదలను ఆదుకోవడంలో వైరా లయన్స్‌క్లబ్‌లు ముందుంటాయని అన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులను తీర్చిదిద్ది ప్రయోజకులను చేసిన ఘనత లయన్స్‌క్లబ్‌లకు దక్కిందని అనేక మంది విద్యార్థిని, విద్యార్థులపై చదువుల నిమిత్తం ధాతల ద్వారా క్లబ్‌ల ద్వారా ఫీజులు నిమిత్తం ఆర్థిక సహాయం అందించామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్లబ్‌ల ద్వారా సహాయం పొందిన విద్యార్థులు ఉద్యోగంలో స్థిరపడ్డారని తద్వారా కుటుంబానికి చేయూతనందించారని తెలిపారు. అనంతరం చింతోజు నాగేశ్వరరావు చిన్ననాటి గురువు అయిన కాపా గోపాలరావును ఘనంగా సన్మానించారు. అనంతరం వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఇరువురి దంపతులను ఘనంగా సన్మానించి కేక్ కటింగ్ చేసి లయన్స్‌క్లబ్ సభ్యులందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిఎస్టి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ లగడపాటి ప్రభాకర్‌రావు, జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్‌రావు, క్లబ్ సెక్రటరీ అబ్బూరి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు గజ్జల కృష్ణమూర్తి, ఏడునూతల బుఇచ్చరామారావు, క్లబ్ సభ్యులు రాయపూడి వెంకటేష్, చెరుకూరి శ్రీనివాసరావు, గద్దె నీరజ, రంగా సత్యనారాయణ, మాదినేని దుర్గాప్రసాద్, నల్లమోతు లక్ష్మీనారాయణ, నంబూరు రామారావు, వజినేపల్లి చక్రవర్తి, క్లబ్ పిఆర్‌వో ఏపూరి రాజారావు, డాక్టర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన జయమ్మ ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో ముందు తన పేరు వచ్చిందని తర్వాత తొలగించారని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. నాగులవంచ రెవెన్యూ గ్రామానికి చెందిన జి. రాములు తనకు సర్వే నెం. 279/ఆ/1/1లో 1.10 ఎకరాల భూమి ఉందని నాగులవంచ, చొప్పకట్లపాలెం రోడ్డు నాలుగు అడుగుల ఎత్తులో వేస్తున్నారని దీని వల్ల తన భూమితో పాటు 100 ఎకరాలకు పైగా పంట నష్టం జరుగుతుందని పంట పొలాలు వర్షపు నీరుకు మునిగిపోకుండా తూములు వేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన రామారావు తాను దివ్యాంగ నిరుపేదనని ఎంఏ బిఈడి పూర్తి చేశానని తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర టౌన్ పరిధిలోని శాంతిభద్రదల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎస్సై గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిష్కరించకోవాలని తెలిపారు. పట్టణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఎంతటి వారిపైనైనా చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని, వాహనాలకు సంబంధిందిచిన అన్ని ధృవీకరణ పత్రాలు ఉండాలని, ట్రాఫిక్ నియమి నిబంధనలను ఉల్లగించిన వారిపై వారి వాహనాలను సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నిషేద గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, గంజాయిని నియంత్రించడంలో ప్రతిఒక్కరూ పోలీస్ వారికి సహకరించాలన్నారు. శాంతిభద్రల పరిరక్షణకు పోలీస్‌శాఖ తీసుకునే చర్యలకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**-భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఏసి పిలుపు**



**ప్రజాపక్షం/బోనకల్:** కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఏసి నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిఐటియూ కార్యాలయం వద్ద సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెఏసి నాయకులు మాట్లాడుతూ..భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాల దశాబ్దాల పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం1996, అంతరరాష్ట్ర వలస కార్మికుల చట్టం1979, కాంట్రాక్ట్ చట్టం1970 తదితర 29 కార్మిక చట్టాలను సాధించుకున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. భారత కార్మిక వర్గానికి గొడ్డలి పెట్టు వంటి ఈ నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలతో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు పిలుపునిచ్చాయన్నారు. కావునా భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, కిలారి సురేష్, సిఐటియూ మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు, షేక్ ఖాదర్‌బాబా, గుగులోత్ నరేష్, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, ఐఎన్‌టియూసీ మండల కార్యదర్శి మేకల శరత్, భద్రునాయక్, గుంపుల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు టీచర్లకు వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/ మధిర :** 2008 డిఎస్సీ ద్వారా కాంట్రాక్టు ఉపాధ్యాయు లు నియామకం పొందిన వారికి పెండింగ్ నా లుగు జీతాలను వెంటనే చెల్లించాలని టిఎస్‌యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నా గేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిరలోని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యా ఫెడరేషన్ కార్యాలయం నందు సోమవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జీతాలు అందక కాంట్రాక్ ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులన్నింటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు నమోదు పెంచడంతో పాటు మౌలిక వసతులకు కల్పించేందుకు కృషి చేయాలనికోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి షేక్.నాగూర్‌వలీ, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఎ.వినోద్‌రావు, మధిర మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బండారు నాగరాజు, వీరయ్య, ఉపాధ్యక్షులు షేక్.ఇబ్రహీం, ఊట్ల శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

**ప్రజాపక్షం/ కారేపల్లి :** గంజాయితో పట్టుబడ్డ వాలిపిరెడ్డి రాజ్‌కమల్ తో పాటు మరో వ్యక్తి అరెస్టు చేసినట్లు కారేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కారేపల్లి ఎస్ఐ రాజారాం తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కారేపల్లి క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా రెండు కిలోల ఎండు గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. వారిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ప్రాంతానికి చెందిన నిందితుడు రాజ్‌కమల్ (27) గతంలో ఇల్లందు, కారేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు హత్య కేసుల్లో ప్రధాన నిందితుడని అదే విధంగా ఖమ్మం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఒక గంజాయి కేసులో నిందితునిగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కొత్తగూడెం ప్రాంతానికి చెందిన మరో నిందితుడు కుంజా దిలీప్ (28) అని తెలిపారు. గంజాయి విక్రయించేందుకు సోమవారం సాయంత్రం కారేపల్లి క్రాస్ రోడ్డులో వేచి చూస్తున్న క్రమంలో పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డిపిఎస్ చట్టం క్రింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.